క్లుప్తంగా

విద్యకున్న గౌరవాన్ని పెంచుదాం



వడ్డాది కాలేజీలో ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్న లెక్చరర్లు, సిబ్బంది

బుచ్చెయ్యపేట: విద్యకున్న గౌరవాన్ని పెంచేలా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఇంటర్మీడియెట్ బోర్డు డీఐఈవో ఎం.వినోద్‌బాబు కోరారు. శనివారం కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమాజంలో విద్యకు ఉన్న గొప్ప తనం గురించి ఆయన విద్యార్థులకు వివరించారు. గురుశిష్యుల బంధం గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అవార్డు అందుకున్న ప్రిన్సిపాల్ జి.చిన్నారావుతో పాటు లెక్చరర్లను సత్కరించారు. లెక్చరర్లు నరసింహమూర్తి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

‘రైతులకు ఎరువులు ఇవ్వలేకపోయారు’

మాడుగుల రూరల్: రైతులకు ఎరువులు పంపిణీ చేయలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని, ఒక యూరియా బస్తా కోసం రైతు సేవా కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, కె.జె.పురం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాళ్ల రాము అన్నారు. శనివారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలీసుల బందోబస్తుతో రైతులను నిరోధించి యూరియాను పంపిణీ చేసే స్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు రోడ్డెక్కిన పరిస్థితి ఎప్పుడూ దాపురించలేదన్నారు. కె.జె.పురం రైతు సేవా కేంద్రంలో 20 రోజుల క్రితం 12 టన్నుల యూరియాను ఎంత మంది రైతులకు అందించారని ఆయన ప్రశ్నించారు. టీడీపీ కార్యకర్తలకు దొడ్డిదారిన యూరియా అందించారని ఆయన విమర్శించారు.

మంచినీటి పథకానికి భూమి పూజ



ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీటీసీ గోపి

కె.కోటపాడు : లంకవానిపాలెంలో మంచినీటి పథకం నిర్మాణానికి స్థానిక ఎంపీటీసీ నెక్కల గోపి శనివారం భూమి పూజ చేశారు. రూ.18 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో 30 వేల లీటర్ల సామర్థ్యం గల మంచినీటి పథకంను నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు.

చోడవరంలో ఘనంగా పాత్రికేయుల దినోత్సవం



విలేకరులను సత్కరిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

చోడవరం : చోడవరం పట్టణంలో శనివారం పాత్రికేయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కన్యకాపరమేశ్వరుల ఆలయంలో వాసవీ వారోత్సవాల్లో భాగంగా విలేకరులతో పాటు పేపర్ బాయ్స్‌ను వాసవీ క్లబ్ సభ్యులు సత్కరించారు. అనంతరం ప్రముఖ వైద్యుడు బంగారు కృష్ణ ఆర్థిక సాయంతో వృద్ధులకు దుస్తులు, ప్రేమ సమాజంలో భోజనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి కామరాజు, ట్రెజరర్ శ్రీనివాసరావు, వనిత క్లబ్ అధ్యక్షుడు పి.తులసి, సెక్రటరీ జానకి, కోశాధికారి కనక లక్ష్మి పాల్గొన్నారు.

డ్రోన్‌తో మందుల పిచికారీపై అవగాహన



డ్రోన్‌తో స్ప్రే చేయడంపై అవగాహన కల్పిస్తున్న ఏవో విజయలక్ష్మి

నర్సీపట్నం: ధర్మసాగరంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నానో యూరియాపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నానో యూరియాను డ్రోన్ ద్వారా స్ప్రే చేయడంపై రైతులకు ఏవో విజయలక్ష్మి అవగాహన కల్పించారు. ఎకరాకు 500 ఎంఎల్ చొప్పున నానో యూరియాను పిచికారీ చేసుకోవాలన్నారు. నానో యూరియా 500 ఎంఎల్ ఖరీదు రూ.240 ఉంటుందన్నారు. మనుషులతో పని లేకుండా డ్రోన్ ద్వారా పొలానికి పిచికారీ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుకల రమణమ్మ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాల కోసం

ఎదురుచూపులు!



హాజరైన దరఖాస్తుదారులు(ఫైల్)

- ఐదు నెలల కిందట ఇంటర్వ్యూల నిర్వహణ
- బ్యాంక్‌లకు చేరిన బీసీ కార్పొరేషన్ లబ్ధిదారుల జాబితా
- యూనిట్‌ల గ్రౌండింగ్‌లో ముందుకు పడని అడుగు
- మాడుగుల నియోజకవర్గంలో 2,490 మంది దరఖాస్తు

మండలాల వారీగా దరఖాస్తుల వివరాలు

మండలం	వచ్చిన దరఖాస్తులు	మంజూరైన యూనిట్లు
కె.కోటపాడు	645	124
దేవరాపల్లి	735	91
చీడికాడ	200	68
మాడుగుల	910	65
మొత్తం	2,490	348

కె.కోటపాడు : బీసీ కార్పొరేషన్ మంజూరు చేసే సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తుదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీ రుణంతో యూనిట్ ఏర్పాటుతో ఆర్థిక భరోసా పొందవచ్చునని ఆశపడ్డ నిరుద్యోగ యువతకు ఐదు నెలలుగా నిరాశే ఎదురవుతోంది. కార్పొరేషన్ రుణాలు ఎప్పుడు మంజూరవుతాయో తెలియక అయోమయంలో ఉన్నారు. 2024–25 ఏడాదికి బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరు కోసం దరఖాస్తులను ఈ ఏడాది మార్చి 10 నుంచి 25 వరకూ ఆన్‌లైన్‌లో స్వీకరించారు. వీరికి ఇంటర్వ్యూలను ఏప్రిల్ 4న నిర్వహించారు. రుణాల మంజూరుకు లబ్ధిదారుల ఎంపిక జాబితాను బ్యాంక్‌ల అధికారులకు మండల పరిషత్ అధికారులు పంపించారు. బ్యాంక్‌ల వద్దకు దరఖాస్తుదారులు వెళితే యూనిట్ మంజూరు కోసం ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీ నగదు ఇంకా విడుదల కాలేదని సంబంధిత అధికారులు తెలుపుతున్నట్లు సమాచారం. దీంతో అసలు బీసీ కార్పొరేషన్ రుణాలు ఈ ఏడాది మంజూరవుతాయో? లేదో? అన్న మీమాంసం దరఖాస్తుదారుల్లో వ్యక్తమవుతోంది. మరికొందరు దరఖాస్తుదారులు వచ్చే ఏడాదికి తమ వయస్సు ఎక్కువ కావడంతో దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండాపోతుందని ఆందోళన చెందుతున్నారు. మాడుగుల నియోజకవర్గంలో 2,490 మంది బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి అర్హులకు వెంటనే రాయితీ రుణాలను మంజూరు చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.



లబ్ధిదారుల ఎంపికకు బ్యాంకర్స్‌తో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీవో సుబ్రహ్మణ్యం(ఫైల్)

> **తక్షణం రుణాలు ఇవ్వాలి**
>
> బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేశా. ఇంటర్వ్యూకు కూడా హాజరయ్యాను. బ్యాంక్‌కు వెళ్లి నా పేరు వచ్చిందో లేదో అని అడగగా.. ఎంపీడీవో కార్యాలయ అధికారులు అర్హుల జాబితా పంపించాలని చెబుతున్నారు. కార్పొరేషన్ రుణం మంజూరైతే నాలాంటి నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుంది. తక్షణం రుణాలు మంజూరు చేయాలి.
>
> – ఎల్.నర్సింగరావు, దరఖాస్తుదారుడు

పట్టాల కోసం ఈనాం భూముల సాగుదారుల ఆందోళన



కె.కోటపాడు కూడలిలో ఆందోళన చేస్తున్న పాచిలవానిపాలెం, చౌడువాడ రైతులు

కె.కోటపాడు : తమ సాగులో ఉన్న ఈనాం భూములకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ పాచిలవానిపాలెం, చౌడువాడ గ్రామాలకు చెందిన రైతులు శనివారం కె.కోటపాడులో ధర్నా చేశారు. ముందుగా మూడు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి పట్టాలు మంజూరు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ, జిల్లా కార్యదర్శి కోన మోహన్ మాట్లాడుతూ 1959 నుంచి 1994 వరకూ ఈనాం గెజిట్ పబ్లికేషన్, ఆర్డీవో ప్రొసీడింగ్, హైకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ ఈ భూములు ఏ సంస్థకు చెందవని 2015లో రెవెన్యూ అధికారులకు తెలియజేసినట్లు తెలిపారు. అయినా అప్పటి అధికారులు ఈ భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండా చింతలపాటి బుచ్చి సీతయ్యమ్మ సత్రం పేరిట ఎండోమెంట్ భూములుగా రెవెన్యూ రికార్డుల్లో చేర్చారని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం ఇప్పుడు చేస్తున్న రీసర్వే కార్యక్రమంలో ఈ 353 ఎకరాలకు చెందిన రెండు గ్రామాల్లో భూముల రికార్డులను పూర్తిగా పరిశీలన చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ బుజంగరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నవయుగ సమైక్య జిల్లా కన్వీనర్ నందారపు భాస్కరరావు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, మాడుగుల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు ఆకుల సాయి ప్రసాద్, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, వంటాకు గోవిందరావు, బొడ్డు దేముడుబాబు, కోమార ఎర్రునాయుడు, కోమార వెంకటరమణ, గండి సత్యం, సిరపరపు రమణారావు, ధనిమిశెట్టి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

‘పంతాలకు పోతే సమస్యలు పరిష్కారం కావు’



పీజీఆర్ఎస్ ఫిర్యాదులు పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి మంగవేణి, తహశీల్దార్

నాతవరం: ప్రతి చిన్న విషయానికి కేసులు పెట్టుకుంటే కుటుంబాల మధ్య వివాదాలు పెరిగిపోతాయని మండల ప్రత్యేకాధికారి మంగవేణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పీజీఆర్ఎస్ ఫిర్యాదుదారులతో సమావేశం నిర్వహించారు. ముందుగా మండలం నుంచి ఫిర్యాదులను స్వయంగా పరిశీలించగా అధికంగా ఇంటి స్థలాలు వివాదం, భూమి తాలుకా తగదాలు కుటుంబీకుల మధ్య అధిక శాతం ఫిర్యాదులు ఉన్నాయి. ఈ మేరక ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పెద్దల సమక్షంలో పరిష్కారించుకునే చిన్న సమస్యలను సైతం కేసులు, కోర్టులకు వెళ్లడం వల్ల కుటుంబీకుల మధ్య దూరం పెరిగి ఇరువురు ఆర్థికంగా ఇబ్బందులు పడతారన్నారు. చట్టాన్ని ఉల్లఘించి వివాదాలకు చెందిన భూముల్లోకి ఇరువురు తగదాలు పడితే కేసు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధనలు.. నిమజ్జనోత్సవాలు



వీరవల్లి అగ్రహారం కాపు వీధిలో అన్నసమారాధన



ఎ.కొత్తపల్లిలో వినాయకుడిని దర్శించుకుంటున్న ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మీ, సర్పంచ్ సత్య వెంకటరమణ

మాడుగుల రూరల్: వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం వివిధ గ్రామాల్లోని వినాయక మండపాల వద్ద అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. వీరవల్లి అగ్రహారం కాపు వీధిలో అన్నదానం చేశారు. సాగరం శివారు వాడపాడు రామాలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కె.జె.పురం పాలగెడ్డ సమీపంలో బెల్లాలు వారి కళ్లాలు వద్ద అన్నదానం చేశారు.

దేవరాపల్లి: ఎ.కొత్తపల్లిలో పెద్దన్న గారి, బుగిడివారి కల్లాల్లో శ్రీపైడిమాంబ యూత్ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మీ, స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, ఉప సర్పంచ్ పండూరి సరువునాయుడు.. వినాయకుడిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

గుంతల రోడ్డులో చేపలు పడుతూ నిరసన



కొత్తకోటలో గుంతల్లో చేపలు పడుతూ నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

రావికమతం: కొత్తకోటలో కొత్త పెట్రోల్ బంక్ ఎదురుగా బీఎన్ రోడ్డుపై గుంతల్లో సీపీఎం ఆధ్వర్యంలో చేపలు పడుతూ శనివారం విన్నూతంగా నిరసన తెలిపారు. చోడవరం నుంచి నర్సీపట్నం మధ్యలో భారీ గోతులు ఏర్పడ్డాయి. వడ్డాది వద్ద పెద్దేరు వంతెన, విజయరామరాజు పేట వద్ద దగ్గర బొడ్డేరు వంతెన కూలిపోవడంతో ప్రజలు గౌరీపట్నం నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికీ బ్రిడ్జి పనులు పాలకులు మొదలు పెట్టలేదని, తక్షణమే పనులు ప్రారంభించాలని సీపీఎం నాయకుడు కె.గోవిందరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్.వలసయ్య, పాడి బెన్నయ్య, జోగిరాజు, గిరిజన సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో వైద్య సేవలు



విద్యార్థులకు సూచనలు చేస్తున్న వైద్యాధికారి శ్యామ్

గొలుగొండ: విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించి వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గొలుగొండ వైద్యాధికారి శ్యామ్ సూచించారు. గొలుగొండ గురుకుల కళాశాలలో శనివారం విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల ఆట స్థలం ఆక్రమణపై ఫిర్యాదు



మండల ప్రత్యేకాధికారి మంగవేణికి ఫిర్యాదు చేస్తున్న హెచ్‌ఎం

నాతవరం: పాఠశాల ఆట స్థలాన్ని ఆక్రమించి కట్టడాలు చేస్తున్నారని గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు శనివారం మండల ప్రత్యేకాధికారి మంగవేణి, తహసీల్దార్ వేణుగోపాల్‌కు ఫిర్యాదు చేశారు. మండలంలో సరుగుడు పంచాయతీ శివారు రామన్నపాలెం గ్రామంలో గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల ఉంది. ఈ పాఠశాలకు చెందిన ఆట స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని అక్రమ కట్టడాలు చేస్తున్నారని, దానిని వెంటనే అడ్డుకోవాలని హెచ్‌ఎం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలకు చెందిన మొత్తం స్థలాన్ని సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని కోరారు. పాఠశాల స్థలం రికార్డులు తమకు అందిస్తే సర్వే చేసి ఆక్రమదారులను ఖాళీ చేయిస్తామని తహసీల్దార్ తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత

రావికమతం: ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధిత కుటుంబాలకు చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు శనివారం తన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావికమతం మండలంలో తొమ్మిది మంది లబ్ధిదారులకు మొత్తం రూ.6,49,768 చెక్కుల రూపం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శంకరరావు, మాజీ అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

యూరియాకు బదులు కాంప్లెక్స్ ఎరువుల వినియోగం మేలు



యూరియా పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయాధికారి సోమశేఖర్

కె.కోటపాడు : రైతులు యూరియాపైనే ఆధారపడకుండా కాంప్లెక్స్ ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి ఎం.సోమశేఖర్ సూచించారు. మండలంలో శనివారం గుల్లేపల్లి, కె.కోటపాడులో యూరియా పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకూ కె.కోటపాడు, చౌడువాడ పీఏసీఎస్‌ల ద్వారా 128 మెట్రిక్ టన్నుల యూరియాను అందించినట్లు తెలిపారు. యూరియాకు బదులుగా డీఏపీ లేదా 28.28.0, 20.20.0 మందును జల్లుకోవాలన్నారు.

పెద్దేరుకు తగ్గిన వరద పోటు

మాడుగుల: మండలంలోని పెద్దేరు జలాశయానికి వరద పోటు తగ్గింది. జలాశయం గరిష్ట నీటి మట్టం 137 మీటర్లు కాగా.. ప్రస్తుతం 136.14 మీటర్లకు తగ్గిపోయింది. జలాశయంలోకి గత రెండు రోజుల నుంచి 600 క్యూసెక్కులు వరద నీరు వచ్చి చేరగా.. శనివారం సాయంత్రానికి 250 క్యూసెక్కులకు తగ్గి పోయిందని జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. పంట పొలాలకు ప్రధాన పంట కాలువల ద్వారా 80 క్యూసెక్కుల సాగునీరు విడుదల చేస్తున్నామన్నారు.

మెడికల్ కళాశాలను ధారాదత్తం చేయడం తగదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకుడు శ్రీనివాసరావు

నర్సీపట్నం: మెడికల్ కళాశాలను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం తగదని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఒప్పించి మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ నియోజకవర్గానికి మెడికల్ కళాశాల తీసుకువచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వైద్య రంగాన్ని వ్యాపారం చేస్తుందని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే, స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు నియోజకవర్గ ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే మెడికల్ కళాశాల ప్రైవేటుపరం కాకుండా కాపాడాలన్నారు. కళాశాల అందుబాటులోకి వస్తే నియోజకవర్గ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రైవేటు పరం చేసే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాతవరం, గొలుగొండ, నర్సీపట్నం రూరల్, మున్సిపాలిటీ, మాకవరపాలెం విద్యార్థి విభాగం మండల అధ్యక్షులు స్వామి, అప్పలనాయుడు, నాగేంద్ర, రాధాకృష్ణ, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



కేజీబీవీలో విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యురాలు శ్రావణి, సిబ్బంది

రోలుగుంట: స్థానిక కేజీబీవీ, బీసీ వసతి గృహాల విద్యార్థులతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో రోలుగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇక్కడ విద్యార్థులకు వైద్యురాలు శ్రావణి అవసరమైన పరీక్షలు చేశారు. ల్యాబ్ టెక్నీషియన్ చంద్రశేఖర్ రక్త పరీక్షలు చేశారు. అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. విశ్రాంతి సమయంలో దోమ తెరలు విధిగా వాడాలని ఎంపీహెచ్ఈవో కృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ సాజహాన్ సూచించారు.

నర్సీపట్నం: గిరిజన సంక్షేమ కళాశాల బాలుర వసతిగృహం–2లో అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ఎ.చాందిని విద్యార్థులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ప్రస్తుతం వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నందున విద్యార్థులు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు.

నానో ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలి



కొత్తపెంటలో మాట్లాడుతున్న ఏవో కాంతమ్మ, మండల ప్రత్యేక అధికారి మంజులవాణి

దేవరాపల్లి: రైతులు నానో ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి ఎస్. మంజులవాణి సూచించారు. ఈ మేరకు కొత్తపెంటలో స్థానిక సర్పంచ్ రొంగలి వెంకటరావు అధ్యక్షతన శనివారం మండల వ్యవసాయ అధికారి ఎల్.వై.కాంతమ్మతో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పీఎం ప్రణామ్ స్కీమ్ పేరిట కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నానో యూరియా, డీఏపీ వినియోగం పెరగాలన్నారు.

నాతవరం: రైతులు నానో యూరియా, డీఏపీ వాడకంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని మండల వ్యవసాయాధికారి సుగుణ కోరారు. మండలంలో శనివారం గన్నవరం మెట్ట, మన్యపురట్ల, నాతవరం గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను తహసీల్దార్ వేణుగోపాల్‌తో కలిసి ఆకస్మిక తనిఖీలు చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి మంగవేణి ఆధ్వర్యంలో రైతులకు యూరియా వాడకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ యూరియా కంటే నానో యూరియా పంటలకు వేయడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. నానో యూరియా, సాధారణ యూరియా మధ్య ఉపయోగాలు, వ్యత్యాసాలపై రైతులకు అవగాహన కల్పించారు.

తెనుగుపూడి హైస్కూల్‌లో గురు పూజోత్సవం



తెనుగుపూడి హైస్కూల్‌లో గురువులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

దేవరాపల్లి: తెనుగుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురు పూజోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి స్థానిక హెచ్‌ఎం డి.ఎస్.ఎస్.వి.ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులకు విద్యార్థులు పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్దాడ వెంకటరమణ, శ్రీనివాసరావు, మహేశ్వరరావు, త్రినాథ్, మాధవరావు, పద్మావతి, కొండమ్మ, సోములమ్మ, సుగుణకుమారి, మనోహర్, శ్యామల పాల్గొన్నారు.